
సాక్షి మెదక్

మంగళవారం । 12 । ఆగస్టు । 2025



అసైన్డ్..అన్యాక్రాంతం!

అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూముల కబ్జాకు గురవుతున్నాయి.


వివరాలు 8లో ▸



నేరం ఇక్కడ.. మకాం అక్కడ

గంజాయి రవాణా కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వారే పట్టుబడుతున్నారు.

వివరాలు 8లో ▸



ఉపకారం.. భవితకు ఊతం!

ప్రభుత్వ విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రత్యేక చొరవ తీసుకుంటుంది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శివ్వంపేట(నర్సాపూర్): మనోహరాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రాకేశ్ తెలిపారు. శివ్వంపేట మండలంలోని సికింద్లాపూర్, గోమారం, చండి, శభాశ్‌పల్లి పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో త్రీ ఫేజ్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

‘పైరవీలకు తావు లేదు’

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 21 ఫిర్యాదులు రాగా, వాటిని పరిశీలించి చట్ట ప్రకారం ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, పైరవీలకు తావు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించాలి



అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, మంగళవారం జరిగే సమావేశానికి ట్రేడ్ యూనియన్లను ఆహ్వానించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజ్జమర్రి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ నగేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని పరిశ్రమల్లో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సరైన రక్షణ చర్యలు ఉండటం లేదని వాపోయారు. గతంలో ట్రేడ్ యూనియన్‌తో సేఫ్టీ కమిటీ వేశారని, ఒక్కసారి కూడా అధికారులు సమావేశం జరపలేదని వాపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌కి విద్యార్థి ఎంపిక

మెదక్ కలెక్టరేట్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (రామంతాపూర్)కు సోమవారం లాటరీ ద్వారా విద్యార్థిని ఎంపిక చేశారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్ పాల్గొన్నారు. పాఠశాలలో 1వ తరగతికి ఇంగ్లిష్ మీడియంలో ఒక సీటు ఖాళీ ఉండగా, ఇటీవల పత్రిక ప్రకటన చేశారు. ఇందుకు పలువురు విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, నార్సింగి మండలం జప్తిశివనూర్‌కు చెందిన దొబ్బల రోసిన ఎంపికైనట్లు తెలిపారు.

అంగన్‌వాడీల్లో ప్రీ ప్రైమరీ నిర్వహించాలి

మెదక్ కలెక్టరేట్: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ విద్యను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం డీడబ్ల్యూఓ హైమావతికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ.. కేంద్రం ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ విద్యను తీసుకొచ్చి అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. జిల్లాలో 3 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులు, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించడంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కేంద్రం ప్రత్యేక వలంటీర్లను నియమించి అదనపు కేంద్రాలను నిర్వహించాలని చూస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను కాపాడుకోకుండా, కేంద్రానికి వత్తాసు పలుకుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు జబీన్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక

గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి యోగా పోటీలకు గజ్వేల్‌కు చెందిన బచ్చల ప్రసన్నలక్ష్మి ఎంపికైనట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే జైన సంధ్య, సురేష్, మనీషా, కవిత, బత్తిని సంధ్య, సంపత్, నర్మదలు ఎంపికైనట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లో జరుగనున్న జాతీయ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

మరింత సహకారం

రైతు ఉత్పత్తి సంఘాలుగా పీఏసీఎస్‌లు

- జిల్లాలో ఐదు సొసైటీల ఎంపిక
- ప్రభుత్వ నిధులతో వ్యాపారం చేసుకునే వెసులుబాటు
- రైతుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా చర్యలు



రైతు ఉత్పత్తి కేంద్రంగా గుర్తింపు పొందిన ఫరీద్‌పూర్ సొసైటీ

రైతులకు పంట రుణాలు ఇవ్వడం, తిరిగి వాటిని వసూలు చేసుకోవడానికే పరిమితమైన ప్రాథమిక సహకార సంఘాలు రూపు మార్చుకుంటున్నాయి. విడతల వారీగా సంఘాలను ఆధునీకరించడంతో పాటు రైతుల ఆదాయం పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రైతు ఉత్పత్తి సంఘాలను (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్)గా మార్పు చేసింది. ఈమేరకు జిల్లాలో ఐదు సొసైటీలను ఎంపిక చేసింది.

– రామాయంపేట(మెదక్)

జిల్లాలో మొత్తం 37 సహకార సంఘాలున్నాయి. నామమాత్రంగా ఎరువుల అమ్మకాలు, రైతులకు పంట రుణాలివ్వడం, తిరిగి వసూలు చేసుకోవడం వంటి కార్యకలాపాలకే పరిమితమయ్యేవి. చాలావరకు సంఘాలు నష్టాలబాట పట్టగా, లాభాల్లో కొనసాగుతున్న వాటిని మరింత ప్రోత్సహించడానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. జిల్లా పరిధిలో రైతు ఉత్పత్తి సంఘాలుగా ఎంపికైన వాటికి కేంద్రం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయనుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులే సంఘంగా ఏర్పడి తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌లో అమ్ముకునేలా వెసులుబాటు కల్పించనుంది. దీంతో పాటు రైతులకు ఆధునిక వ్యవసాయానికి

ఎంపికైన ఎఫ్‌పీఓల వివరాలు	
మండలం	సహకార సంఘం
నర్సాపూర్	నర్సాపూర్
తూప్రాన్	తూప్రాన్
హవేలిఘణాపూర్	ఫరీద్‌పూర్
చిలప్‌చెడ్	సోమక్కపేట
శివ్వంపేట	శివ్వంపేట

అవసరమయ్యే సాంకేతిక సలహాలు ఇవ్వనుంది. డ్రోన్లు, రోబోటిక్స్ వంటి యంత్రాల వినియోగం విషయమై వారికి సాంకేతిక పరిజ్ఞానం అందజేస్తుంది. వీటితో పాటు మార్కెటింగ్, ధాన్యం నిల్వలు, ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణ, పాల ఉత్పత్తి సంఘాల ఏర్పాటు, శీతల గిడ్డంగుల నిర్మాణం, జన ఔషధి కేంద్రాల ఏర్పాటు, ఆధునిక వ్యవసాయ పరికరాల విక్రయం, మత్స్య కేంద్రాల నిర్వహణ వంటి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తారు. అధికారుల పర్యవేక్షణలో వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతాయని సమాచారం.

ఒక్కో ఎఫ్‌పీఓకు రూ. 33 లక్షలు

ఎంపిక చేసిన ఎఫ్‌పీఓలకు ఏడాదికి రూ. ఆరు లక్షల చొప్పున మూడేళ్లకు రూ. 18 లక్షలు నిర్వహణ ఖర్చుల నిమిత్తం కేంద్రం మంజూరు చేయనుంది. దీంతో పాటు అదనంగా రూ. 15 లక్షలు ఈక్విటీ గ్రాంట్ విడుదల చేస్తారు. ఒక్కో ఎఫ్‌పీఓకు క్రెడిట్ గ్యారంటీ కింద రూ. రెండు కోట్ల వరకు గ్యారంటీ సదుపాయం లభిస్తుంది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా అదనంగా వీటి నిర్వహణ నిమిత్తం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసే అవకాశం ఉందని సమాచారం.

వ్యాపారం చేసుకునే వెసులుబాటు



జిల్లాలోని ఐదు సంఘాలు రైతు ఉత్పత్తి కేంద్రాలుగా ప్రమోట్ అయ్యాయి. సంఘాల అభివృద్ధితో పాటు వీటి పరిధిలో ఉన్న రైతులు ఐకమత్యంగా వ్యాపారం చేసుకోవడానికి వీలుగా ప్రత్యేకంగా నిధులు మంజూరవుతాయి. వీటి పరిధిలో సభ్యులుగా ఉన్న రైతులకు సాంకేతిక పరమైన సలహాలతో పాటు డ్రోన్లు, ఇతర యంత్రాల నిర్వహణ విషయమై అవగాహన కల్పిస్తారు.

– కరుణాకర్, జిల్లా సహకార అధికారి



రైతు బీమా.. ధీమా

రేపటితో ముగియనున్న గడువు

- నేటితో ముగియనున్న నామినీ సవరణ
- జిల్లాలో 1.77 లక్షల రైతుల ఇన్సూరెన్స్ రెన్యూవల్
- కొత్తగా పాస్‌పుస్తకాలు పొందినవారు 12 వేల పైచిలుకు..



మెదక్‌జోన్: రైతుబీమా దరఖాస్తు గడువు రేపటితో ముగియనుంది. ఇప్పటికే అర్హులైన పాత వారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతులందరికీ ఈనెల 14న ఎల్ఐసీ (బీమా) బాండ్లు రానున్నాయి. అలాగే నామినీ పేరు సవరణ చేసుకునేందుకు మంగళవారంతో గడువు ముగియనుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 6 లక్షల పైచిలుకు వ్యవసాయ భూములుండగా, సుమారు 2 లక్షల వరకు రైతులు ఉన్నారు. గత ప్రభుత్వం 2018లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. రైతు ఏ కారణం చేత మరణించినా, ఆ కుటుంబానికి ఎల్ఐసీ పాలసీ తరఫున సదరు రైతు కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున బీమా సొమ్ము చెల్లిస్తుంది. ప్రతి ఏడాది బీమా ప్రీమియం మొత్తం రాష్ట్ర ప్రభుత్వం సదరు ఎల్ఐసీకి చెల్లిస్తోంది. ఈ పథకంలో ఇప్పటివరకు 1,77,084 మంది రైతులు పాతవారు ఉండగా, జూన్ 5 వరకు జిల్లాలో కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు 12,145 మంది ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కొత్తవారు సకాలంలో బీమాకు దరఖాస్తు చేసుకుంటే ఆ సంఖ్య 1,89,229కు చేరనుంది.

బీమాకు అర్హులు వీరే..

రైతు బీమాకు 18 నుంచి 59 ఏళ్ల మధ్య గల రైతులు మాత్రమే అర్హులు. 1966 ఆగస్టు, 2007 ఆగస్టు మధ్యలో జన్మించిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. కాగా ఇప్పటికే ఈ పథకంలో 59 ఏళ్లు నిండిన రైతులు ఉంటే అధికారులు వారి పేర్లను తొలగిస్తారు. కొత్తగా పాస్ పుస్తకం పొందిన రైతులు ఆయా మండలాల ఏఈఓలు, ఏఓలకు పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్‌తో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ అందజేస్తే బీమాకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేస్తారు. అలాగే నామినీ ఆధార్‌కార్డుతో పాటు వివరాలు అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకం పొందిన ప్రతి రైతు ఈనెల 13వ తేదీ వరకు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి. నామినీ సవరణ చేసుకునే వారికి మంగళవారం సాయంత్రం వరకు అవకాశం ఉంది. ఈ పథకం రైతు కుటుంబాలకు కొండంత అండగా ఉంటుంది.

– దేవ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ప్రజావాణికి 66 వినతులు



ప్రజావాణిలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లాస్థాయి ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య ఇతర జిల్లా అధికారులతో కలిసి వినతులు స్వీకరించారు. మొత్తం 66 అర్జీలు రాగా వాటిని పరిశీలించారు. త్వరితగతిన అర్జీలు పరిష్కరించి ప్రజలకు సమాధానం చెప్పాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కాగా ఓ దివ్యాంగురాలు తనకు ఇందిరమ్మ ఇంటి మంజూరులో నెలకొన్న సమస్యను కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన ఆయన దివ్యాంగురాలికి న్యాయం జరిగేలా చూడాలని డీఎల్‌పీఓకు సూచించారు. అనంతరం దివ్యాంగురాలు కలెక్టర్‌కు రాఖీ కట్టింది.

నులి పురుగులను నులుమేద్దాం

మెదక్‌జోన్: నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వాడాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పలువురికి మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కడుపులో ఏర్పడే నులిపురుగుల వల్ల పిల్లల ఎదుగుదల మందగించడంతో పాటు నీరసం, రక్తహీనత, చదువులో ఏకాగ్రత కోల్పోతారని అన్నారు. నివారణకు ఏకైక మార్గం మాత్రలు మింగటమేనన్నారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల వారు 2,11,964 మంది ఉన్నారని, అందరికీ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం వంటశాల, నిత్యావసర వస్తువులు, కూరగాయలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ శ్రీరామ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అనిలా, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాధురి, మలేరియా అధికారి నవ్య, ప్రోగ్రాం అధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఫీ‘వర్రీ’

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో పలువురు డెంగీతో పాటు మలేరియా, వైరల్ ఫీవర్‌తో సతమతం అవుతున్నారు. పట్టణంలోని ఆరో వార్డులో ఒకే ఇంటిలో ముగ్గురు, మరో ఇంటిలో ఒకరు డెంగీ బారిన పడి ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నట్లు తెలిసింది. తాజాగా మరో ఇద్దరు డెంగీ బారినపడ్డారని తెలిసింది. దోమలు పెరగకుండా అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రఘువరణ్‌ను వివరణ కోరగా, గతంలో ఐదుగురు డెంగీ బారినపడి వైద్యం చేయించుకొని ఇంటికి వచ్చారని, తాజాగా మరో ఇద్దరు వైద్యం పొందుతున్నారని చెప్పారు. తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేస్తున్నారని, వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



కోమటికుంట కాల్వను పునరుద్ధరించాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి



కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

నర్సాపూర్: కోమటికుంట అలుగు కాల్వను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె పట్టణంలో పర్యటించారు. తొలుత ఇరిగేషన్ డీఈఈ బుజ్జిబాబు, ఏఈ మణిభూషన్, మున్సిపల్ కమిషనర్ రాంచరణ్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులతో కలిసి వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు, పలు కాల్వలను పరిశీలించారు. అనంతరం రాయరావు చెరువు కట్టు కాల్వను పరిశీలించారు. కాల్వలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు వేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 731 సర్వే నంబర్‌లో 35ఎకరాల భూమి రెవెన్యూ శాఖదని గతంలో ఆ శాఖ అధికారులు తేల్చారని గుర్తు చేశారు. ఇటీవల అటవీశాఖ అధికారులు ఆ భూమి తమదని చెబుతున్నారని అన్నారు. ఈ భూమిలో ఇప్పటికే మున్సిపాలిటీకి చెందిన డంప్‌యార్డు నిర్మించడంతో పాటు ఓయూ పీజీ కాలేజీకి 10 ఎకరాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు మిగితా భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారన్నారు. ప్రస్తుతం ఆ భూమి తమదని అటవీశాఖ చెప్పడంతో సమస్య తలెత్తిందన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

ఎస్పీ శ్రీనివాస్‌రావు



శివ్వంపేట పోలీస్‌స్టేషనలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

మెదక్‌మున్సిపాలిటీ/శివ్వంపేట(నర్సాపూర్)/వెల్దుర్తి(తూప్రాన్): నేరాల నియంత్రణకు పోలీస్ సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం సాయంత్రం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పరిసరాలు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రధాన కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రమాదాలు జరిగే చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి అమ్మకాలు జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ మధుకర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు. అనంతరం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసేవారికి తగిన గుర్తింపు వస్తుందన్నారు. ఇదిలాఉండగా సైబర్ నేరాలపై జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి ఎస్పీ ఒక ప్రకటన విడుదల చేశారు. అప్రమత్తంగా ఉండటంతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని తెలిపారు.

కుంగిన రోడ్డు.. గుంతలో పడిన ట్రాక్టర్



పట్టణంలోని పలు వీధులలో రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం 6వ వార్డులో రోడ్డు కుంగడంతో అదే రూట్‌లో వెళ్తున్న ఓ ట్రాక్టర్ ట్రాలీ గుంతలో పడింది. డ్రైవర్‌తో పాటు యజమాని ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికైనా పట్టణంలోని రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– నర్సాపూర్

ఇందిరమ్మ ఇంటికి ఇసుక తిప్పలు

- జాడలేని శాండ్ బజార్‌లు
- బయట రూ. 2,600కు టన్ను కొనుగోలు
- బిల్లుల చెల్లింపులోనూ చిక్కులే..



పాపన్నపేటలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరుపేదలకు భారంగా మారింది. ఇంటి నిర్మాణానికి ఇసుక తిప్పలు తప్పడం లేదు. జిల్లాలో శాండ్ బజార్లు ఏర్పాటు చేసి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామన్న అధికారుల మాటలు నీటి మూటలుగానే మారాయి. దీంతో ఇంటి నిర్మాణ వ్యయంలో సుమారు మూడో వంతు ఇసుక కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందని లబ్ధిదారులు వాపోతున్నారు. బయట టన్నుకు రూ. 2,600 చెల్లించి కొనుగోలు చేస్తున్నామని, దీనికి రవాణా చార్జీలు అదనమని వాపోతున్నారు.

– మెదక్ అర్బన్

జిల్లాలో మెదక్, నర్సాపూర్, తూప్రాన్ పట్టణాల్లో శాండ్ బజార్లు ఏర్పాటు చేయాలని అధికారుల సంకల్పించారు. కాళేశ్వరం, భద్రాచలం తదితర ప్రాంతాల నుంచి ఇసుక తీసుకొచ్చి, ఈ పాయింట్లలో నిల్వ చేసి, లబ్ధిదారులకు ఉచితంగా సరఫరా చేయాలని సంకల్పించారు. అయితే ట్రాన్స్‌పోర్టు మాత్రం లబ్ధిదారులే భరించాలని సూచించారు. కానీ ఇప్పటివరకు సంబంధిత ప్రాంతాల్లో ఇసుక నిల్వలకు స్థలం దొరకడం లేదని తెలిసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా, మార్కెట్ యార్డుల్లో శాండ్ బజార్‌లు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేయాలని ఆదేశించినట్లు సమాచారం. కాగా త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్న అధికారుల ఆదేశాల మేరకు లబ్ధిదారులు వ్యయ, ప్రయాసల కోర్చి, బయట టన్నుకు రూ. 2,600 చెల్లించి ఇసుక కొనుగోలు చేస్తున్నారు. దీనికి ట్రాన్స్‌పోర్టు అదనం. ఒక్క ఇందిరమ్మ ఇంటికి సుమారు 60 టన్నుల ఇసుక అవసరం అవుతుందని మేస్త్రీలు చెబుతున్నారు. ఈ లెక్కన చూస్తే, ఇందిరమ్మ ఇంటి బిల్లులో సుమారు రూ. 1,80,000 వరకు ఇసుకకే ఖర్చు అవుతుంది. ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇళ్లు అన్నీ ఒకేసారి ప్రారంభం కావడంతో నిర్మాణ వ్యయాలు కూడా పెరిగాయి. సిమెంట్, స్టీల్, మేస్త్రీలు, కూలీల ఖర్చులు అమాంతంగా పెరిగిపోయాయి. దీంతో ప్రభుత్వం ఇచ్చే బిల్లుకు అదనంగా సుమారు రూ. 3 లక్షల వరకు లబ్ధిదారులు భరించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. బిల్లుల చెల్లింపులో సైతం కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బ్యాంకు పాస్‌బుక్‌లో పేర్లు తప్పుగా నమోదు కావడం, ఆధార్, బ్యాంకు లింకు లేకపోవడం, తదితర కారణాలతో బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది.

జిల్లాకు మంజూరైన ఇళ్లు	9,125
ప్రారంభమైనవి	5,500
బిల్లులు చెల్లించింది	1,302

రెండు, మూడు రోజుల్లో సరఫరా



నర్సాపూర్ శాండ్ బజార్ రెండు మూడు రోజుల్లో ప్రారంభం అవుతుంది. మెదక్, తూప్రాన్‌లో కూడా త్వరలో ప్రారంభిస్తాం. లబ్ధిదారులు పిల్లర్లే వేయాల్సిన అవసరం లేదు. రాతి గోడలపైన స్లాబ్ పటిష్టంగా ఉంటుంది. మేస్త్రీలు కూడా న్యాయమైన చార్జీలు తీసుకొని, లబ్ధిదారులకు సహకరించాలి. వ్యాపారులు సరైన ధరలకు సామగ్రి విక్రయించాలి. ఇందుకోసం మండల స్థాయిలో కమిటీలు వేసి అవగాహన సదస్సులు నిర్వహించాం. ఇక నుంచి ఆధార్ ఆధారంగా బిల్లులు చెల్లిస్తాం.

– మాణిక్యం, డీఈ, హౌసింగ్

క్లుప్తంగా

ఎంవోయూ

గజ్వేల్‌రూరల్‌: పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్‌ హబ్‌లో గజ్వేల్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్లేస్‌మెంట్‌ సెల్‌ ఆధ్వర్యంలో సోమవారం మ్యాజిక్‌ బస్‌ ఇండియా ఫౌండేషన్‌తో ఒప్పందం(ఎంవోయూ) చేసుకున్నట్లు ప్రిన్సిపాల్‌, ప్రొఫెసర్‌ అనిత అబ్రహం తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు వివిధ అంశాలపై నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ కమల క్రిస్టియాన, ప్లేస్మెంట్‌ సెల్‌ అధికారి డాక్టర్‌ శోభారాణి, ఫౌండేషన్‌ ప్రతినిధి రంజిత్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్‌ ఉమారాణి, లక్ష్మి పాల్గొన్నారు.

రైతు వేదికలో చోరీ

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): మండలంలోని పెద్దాపూర్‌ రైతు వేదికలో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కార్యాలయంలోని ఫర్నిచర్‌ను అపహరించారు. సోమవారం ఉదయం తలుపులు తెరిచి ఉండటంతో పలువురు రైతులు ఏఈవోకు సమాచారం అందించారు. వారు వెళ్లి చూడగా ఫర్నిచర్‌ను ఎత్తుకెళ్లినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశామని ఏవో రమేశ్‌ తెలిపారు.

ఏడుపాయల ఆదాయం రూ.26.59 లక్షలు


హుండీ లెక్కిస్తున్న నిర్వాహకులు

పాపన్నపేట(మెదక్‌): ఏడుపాయల ఆలయ హుండీ ఆదాయం రూ.26,59,009 వచ్చినట్లు ఈఓ చంద్రశేఖర్‌ తెలిపారు. సోమవారం హుండీ ఆదాయంను లెక్కించగా నగదుతోపాటు ఇతర కానుకలు వచ్చాయని, 45 రోజుల అనంతరం లెక్కించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్‌ సులోచన, ఆలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

రాఖీ పండుగకు వచ్చి తిరిగి వెళ్తుండగా..

కారు ఢీకొట్టడంతో మహిళ మృతి


శివలీల

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి.ఈ ఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి వివరాల ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం నెమిల గ్రామానికి చెందిన శివలీల(45) శనివారం రాఖీ పండుగకు గజ్వేల్‌లోని బంధువుల ఇంటికి వచ్చింది. రాఖీ కట్టిన తరువాత తిరిగి ఆదివారం రాత్రి మేనల్లుడు సంతోష్‌ బైక్‌పై ఎక్కించుకుని స్వగ్రామమైన నెమిలలో దించి రావడానికి బయలు దేరాడు. ఈ క్రమంలో గంధమల్ల నుంచి జగదేవ్‌పూర్‌ వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో శివలీల అక్కడికక్కడే దుర్మరణం చెందింది. సంతోష్‌కు గాయాలయ్యాయి.

గేదెను చంపిన అడవి జంతువులు


గేదెను చంపితిన్న జంతువులు

చేగుంట(తూప్రాన్‌): గేదెను అడవి జంతువులు చంపి తిన్నాయి. ఈ ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... గ్రామానికి చెందిన ముప్పిడి నర్సింహులు పొలం వద్ద గేదెను ఆదివారం రాత్రి కట్టేసాడు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా గేదెను గుర్తుతెలియని జంతువులు చంపి తిన్నాయి. ఈ విషయం ఫారెస్టు అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. వివరాలు సేకరించి వేట కుక్కలు గేదెను చంపి తిన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపూర్‌ అడవిలో హైనాలతో పాటు వేట కుక్కలు ఉన్నాయని, అటవీ ప్రాంతానికి సమీపంలో గేదెలు, పశువులను కట్టేయరాదని అధికారులు పేర్కొన్నారు.

స్కూల్‌ బస్సును ఢీకొట్టిన కారు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

హవేళిఘణాపూర్‌(మెదక్‌): కారు అదుపుతప్పి స్కూల్‌ను బస్సు ఢీకొట్టింది. ఈ ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను తీసుకుని శమ్నాపూర్‌ నుంచి మెదక్‌ వైపు వస్తుంది. ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి స్కూల్‌ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న పాతూర్‌కు చెందిన అనిల్‌కు గాయాలు కాగా మెదక్‌ ఆస్పత్రికి తరలించారు. బస్సు సడన్‌గా బ్రేక్‌ వేయడం వల్ల విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని మెదక్‌రూరల్‌ ఎస్‌ఐ మురళి పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అసైన్డ్‌.. అన్యాక్రాంతం!

భూముల ఆక్రమణకు రాజకీయ అండే కారణమా?

- అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూముల కబ్జా
- సర్వే నం.343లో బండ రాళ్ల తొలగింపు
- 164లో కూడా తాత్కాలిక షెడ్ల నిర్మాణం


సర్వే నం.343లో బండ రాళ్ల తొలగింపు

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూముల కబ్జా పర్వం కొనసాగుతోంది. ఆక్రమణల వెనుక రాజకీయ పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ నేత చెప్పారని అధికారులు అటు వైపు కూడా కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. రాజకీయ పార్టీల నేతలు కొందరు తమ అనుచరులతో కలిసి ఆక్రమణలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

షెడ్లు నిర్మించి.. కబ్జా

అమీన్‌పూర్‌, బీరంగూడ, బంధం కొమ్ము, పటేల్‌గూడ,ఐలాపూర్‌, సుల్తాన్‌పూర్‌ రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ, అసైన్డ్‌ భూముల ఆక్రమణలు కొనసాగుతున్నాయి. అమీన్‌పూర్‌ పట్టణంలో సర్వేనం.343లో తమకు పట్టాలు ఉన్నాయంటూ కొందరు అక్కడున్న బండరాళ్లను తొలగిస్తున్నారు. ఇక్కడ ఎకరా భూమి విలువ రూ.20 కోట్లకు పైగా ఉంటుంది. దాదాపు వందల కోట్ల విలువ చేసే భూమి అన్యాక్రాంతం అవుతుంది. మున్సిపల్‌ పరిధిలో బీరంగూడ- కిష్టారెడ్డిపేట రోడ్డు పక్కన స్థలంలో పథకం ప్రకారం కబ్జాదారులు తాత్కాలిక నిర్మాణాలు వేస్తున్నారు. ఆ భూమి ఐలాపూర్‌ రెవెన్యూ గ్రామ పరిధిలోకి వస్తుంది. అది వివాదాస్పద భూమిగా ఉన్నప్పటికీ తాత్కాలిక షెడ్లు వేస్తూ కబ్జాలు చేస్తున్నారు. ఈ షెడ్లకు తాము అనుమతులు ఇవ్వడం లేదని మున్సిపల్‌ అధికారులు పేర్కొంటున్నారు. పటేల్‌గూడలో ఎల్లంకి కాలేజీ సమీపంలో పాత పంచాయతీ ఆఫీసు ఎదురుగా సర్వే నం.164లో కబ్జాలు కొనసాగుతున్నాయి. ఓ మాజీ ఎంపీపీ ఏకంగా అక్కడ తాత్కాలిక షెడ్‌ వేశారు. అది అసైన్డ్‌ భూమి అని తెలిసి కూడా అధికారులు ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు. ఓ మాజీ వార్డు మెంబర్‌ కిష్టారెడ్డిపేట పంచాయతీ కార్యాలయం ఎదురుగా తన కార్యాలయం కోసం ఓ కంటైనర్‌ డబ్బాను ఏర్పాటు చేశారు. అదే ప్రాంతంలో ఓ వెంచర్‌కు రోడ్డును కూడా నిర్మించారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణమా?

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే ఆక్రమణలు ఆగడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. అమీన్‌పూర్‌ సర్వే నం.343లో తమకు అసైన్డ్‌ పట్టాలు న్నాయంటూ పెద్దపెద్ద బండ రాళ్లను తొలగిస్తున్నారు. అవి పక్కాగా ప్రభుత్వ భూములేనని స్థానికులు సైతం చెబుతున్నారు. కానీ అందులో బండరాళ్లను పగులగొట్టి భూమి చదును చేసే పనులు చేస్తున్నారు. దాదాపు ఐదెకరాల విస్తీర్ణంలో బండరాళ్లను తొలగిస్తున్నారు. ఇందులో చెరువు కాల్వలు కూడా ఉండటంతో వాటిని పూడ్చి చదును చేసే పనులు కొనసాగుతున్నాయి.

కూల్చిన చోటే మళ్లీ నిర్మాణాలు

ఇదిలా ఉండగా ప్రభుత్వ భూముల్లో అధికారులు కూల్చివేసిన చోటే మళ్లీ నిర్మిస్తున్నారు. అలా చేసే వారిని గుర్తించి కేసులు పెట్టాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు. ల్యాండ్‌ గ్రాబింగ్‌ కింద కేసులు పెడితే ఆక్రమణలు ఆగే అవకాశం ఉంది. ఇదే విషయమై స్థానిక తహసీల్దార్‌ వెంకటేశ్‌ను వివరణ కోరగా... ఆక్రమణలు ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ అసైన్డ్‌ భూములను ఆక్రమించే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది కొరత కారణంగా సమస్యలు వస్తున్నాయని తెలిపారు. తాను ఇక్కడకు బదిలీపై వచ్చిన వెంటనే ఆక్రమణలను తొలగించినట్లు గుర్తు చేశారు. మళ్లీ అక్కడే అక్రమ నిర్మాణాలు జరిగితే కచ్చితంగా తొలగిస్తామని పేర్కొన్నారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి

- ములుగు వర్సిటీ వీసీ డాక్టర్‌.రాజిరెడ్డి
- ఎన్‌ఐఆర్‌ఎఫ్‌ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌

ములుగు(గజ్వేల్‌): విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యతోపాటు పరిశోధనలపై దృష్టి సారించాలని ములుగు శ్రీ కొండాలక్ష్మణ్‌ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్‌. రాజిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ములుగు వర్సిటీ, తెలంగాణ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వీసీలతో 'జాతీయ సంస్థాగత ర్యాంకింగ్‌ ఫ్రేమ్‌ వర్క్‌(ఎన్‌ఐఆర్‌ఎఫ్‌)'పై ఒకరోజు వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ రాజిరెడ్డి మాట్లాడుతూ... విశ్వవిద్యాలయాలు ర్యాంకింగ్‌ సాధనకు చేపట్టాల్సిన వివిధ అంశాలు, ప్రాధాన్యతను వివరించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ వి.బాలకిష్టారెడ్డి విశ్వవిద్యాలయ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఎస్‌కెఎల్‌టీజీహెచ్‌యూ ఎట్‌ ఎ గ్లాన్స్‌ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం డిజిటల్‌ లైబ్రరీ సేవలను సులభతరం చేసేందుకు మైలాఫ్ట్‌ మొబైల్‌ యాప్‌ను ప్రారంభించారు. ర్యాంకింగ్‌ తగ్గడానికి ప్రధాన కారణాలు, సవాళ్లు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి డాక్టర్‌. కె.వీరాంజనేయులు వివరించారు. కార్యక్రమంలో ఆయా విశ్వవిద్యాలయాల వీసీలు, ప్రొఫెసర్‌లు పురుషోత్తం, శ్రీరామ్‌ వెంకటేశ్‌, కిషన్‌ కుమార్‌రెడ్డి, ఖాజా అల్తాఫ్‌ హుస్సేన్‌, శ్రీనివాస్‌, జ్ఞానప్రకాశ్‌, నర్సింహా రావు, నందకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ వి.బాలకిష్టారెడ్డి, వీసీ రాజిరెడ్డి తదితరులు

యూట్యూబ్‌ రిపోర్టర్‌ అరెస్ట్‌

రామాయంపేట(మెదక్‌): సర్వేయర్‌ను బెదిరించి ఉంగరం, నగదు లాక్కున్న యూట్యూబ్‌ ఛానల్‌ రిపోర్టర్‌ను సోమవారం స్థానిక పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఎస్‌ఐ బాల్‌రాజ్‌ వివరాల ప్రకారం... నార్సింగి మండల కేంద్రంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న ఎనిశెట్టి శ్రీకాంత్‌ను లంచాలు తీసుకుంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నావని పలుమార్లు యూట్యూబ్‌ రిపోర్టర్‌ లింగంగౌడ్‌ బెదిరించాడు. ఈనెల 7న అతని వద్ద నుంచి ఫోన్‌పే ద్వారా రూ. 5వేలు వేయించుకున్నాడు. మరునాడు తిరిగి శ్రీకాంత్‌కు ఫోన్‌ చేసిన లింగంగౌడ్‌ మెదక్‌కు పిలిపించుకుని రూ. రెండు లక్షలు ఇవ్వాలని డిమాండ్‌ చేశాడు. బాధితుడు డబ్బులు ఇవ్వకపోవడంతో అతని వద్ద ఉన్న రూ. మరో ఐదు వేలు, చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని లాక్కున్నాడు. శ్రీకాంత్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి బంగారు ఉంగరం, కారును స్వాధీనం చేసుకున్నారు.


లింగంగౌడ్‌ను అరెస్ట్‌ చేసిన పోలీసులు

ఇన్సూరెన్స్‌ కోసం ఆందోళన

సిద్దిపేటజోన్‌: మున్సిపల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌ సోర్సింగ్‌ కార్మికులకు ఇన్సూరెన్స్‌ సౌకర్యం కల్పించాలని సోమవారం కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి మాట్లాడుతూ... మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఇన్సూరెన్స్‌ కల్పించాలని, చనిపోయిన కార్మికుల దహన సంస్కారాల నిమిత్తం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. ఇటీవల చనిపోయిన ఇరుకోడ్‌ గ్రామానికి చెందిన రాములు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్‌ చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు.


ధర్నా చేస్తున్న కార్మికులు

సీసీ కెమెరాలతోనే నేరాల నియంత్రణ

పోలీస్‌ కమిషనర్‌ అనురాధ


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీపీ అనురాధ

కొండపాక(గజ్వేల్‌): నేరాలను నియంత్రించడం, నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పోలీస్‌ కమిషనర్‌ అనురాధ పేర్కొన్నారు. కుకునూరుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాల ఆపరేటింగ్‌ సిస్టంను పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా పని చేస్తాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన మాజీ సర్పంచ్‌ పొల్కంపల్లి జయంతితో పాటు వివిధ కుల సంఘాల నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్‌ ఏసీపీ నర్సింలు, సీఐ లతీఫ్‌, ఎస్సై శ్రీనివాస్‌, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


పురుషోత్తం

కొల్చారం(నర్సాపూర్‌): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని చిన్న ఘనాపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హైమద్‌ మోహినుద్దీన్‌ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మైన గల్ల పురుషోత్తం(37) బతుకుదెరువు కోసం మూడేళ్ల క్రితం భార్య కవిత, ఇద్దరు ఆడపిల్లలతో హైదరాబాదులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థికంగా ఎదగకపోవడంతో నెల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులకుతోడు కుటుంబ పోషణ భారంగా మారింది. మనస్తాపానికి గురైన పురుషోత్తం ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో దూలానికి ఉరివేసుకున్నాడు. చర్చికి వెళ్లిన భార్య మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసింది. వెంటనే మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


సుభాష్‌

చిన్నశంకరంపేట(మెదక్‌): పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గవ్వలపల్లి తండాలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్‌ కథనం మేరకు... తండాకు చెందిన బానోత్‌ సుభాష్‌(30) ఈ నెల 2న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మేస్త్రీ పనులు నిర్వహించే సుభాష్‌ ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఏఎన్‌ఎంకు దరఖాస్తులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): జిల్లాలోని లచ్చపేట, దౌల్తాబాద్‌ ఆదర్శ (మోడల్‌) పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టులకు తాత్కాలిక పద్ధతిలో అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 13 సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలన్నారు. ఏఎన్‌ఎంలకు గౌరవ వేతనం రూ.7800 ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు జిల్లా నివాసులై ఉండాలని సూచించారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

పరిశీలించిన డీఎస్పీ సత్తయ్య గౌడ్‌

కంది (సంగారెడ్డి): అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలను సంగారెడ్డి రూరల్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా... మండలంలోని బ్యాతోల్‌ శివారులో గల ఓ క్రషర్‌ కంపెనీలో పేలుడు పదార్థాలను నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు డీఎస్పీ సత్తయ్య గౌడ్‌ ఆధ్వర్యంలో విజిలెన్స్‌, రెవెన్యూ అధికారుల బృందం తనిఖీలు చేసి స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాలు సుమారు 150 కిలోల వరకు ఉంటాయని తెలిపారు. క్రషర్ల కోసం అవసరమైన మేరకు వినియోగించాల్సి ఉండగా అక్రమంగా నిల్వ ఉంచారు. క్రషర్‌ కంపెనీపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ తనిఖీలో తహసీల్దార్‌ రవికుమార్‌, విజిలెన్స్‌ సీఐ మహేశ్‌, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ రంగయ్య పాల్గొన్నారు.


బ్యాతోల్‌ శివారులో పట్టుకున్న పేలుడు పదార్థాలు

వృద్ధురాలు అదృశ్యం


అందోల్‌ ఎల్లమ్మ

సంగారెడ్డి క్రైమ్‌: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌ వివరాల ప్రకారం... హత్నూర మండలం తుర్కలఖానాపూర్‌ గ్రామానికి చెందిన అందోల్‌ ఎల్లమ్మ(65) కండ్ల చికిత్స కోసం శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో ఇంటి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. చుట్టు ప్రక్కల, తెలిసిన బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌



నిజాంపేట(మెదక్‌): పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ రాజేశ్‌ వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని కల్వకుంట గ్రామ శివారులోని ఓ పౌల్ట్రీఫామ్‌పై దాడి చేశారు. పేకాట ఆడుతున్న మెంచు శ్రీకాంత్‌, చిట్యాల రాజు, గోపరి పెంటయ్య, నాగరాజు, చంద్రం, రాజేశంలను పట్టుకున్నారు. వారి నుంచి రూ.1,73,740, 6 మొబైల్స్‌ను స్వాధీనం చేసుకుకుని కేసు నమోదు చేశారు.

మత్తులో వాగులోకి దిగి వ్యక్తి గల్లంతు

జహీరాబాద్‌ టౌన్‌: వాగులోకి దిగిన వ్యక్తి ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం... ఝరాసంగం మండలం పొట్‌పల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌(38)సెంట్రింగ్‌ పనులు చేస్తున్నాడు. సోమవారం భారీగా వర్షాలు కురుస్తుండటంతో అల్గోల్‌-పొట్‌పల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఓ మహిళ వాగు వద్ద గంగమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తుండగా అక్కడికి భాస్కర్‌ వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న అతడు ఆమెతో మాట్లాడుతూనే వాగులోకి దిగాడు. ఈత రాకపోవడంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న జహీరాబాద్‌ రూరల్‌ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి గాలించినా అతడి ఆచూకీ లభించలేదు.

ప్రైవేట్‌ పాఠశాలలో దారుణం

- విద్యార్థిని చితకబాదిన హాస్టల్‌ వార్డెన్‌
- సిబ్బందిని నిలదీసిన ఎస్‌ఎఫ్‌ఐ

వెల్దుర్తి(తూప్రాన్‌): ఓ ప్రైవేట్‌ పాఠశాలకు చెందిన హాస్టల్‌ వార్డెన్‌ విద్యార్థిని చితకబాదాడు. మాసాయిపేట మండలం రామంతాపూర్‌ గ్రామ శివారులోని జాన్‌ అకాడమీ ప్రైవేట్‌ పాఠశాలలో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలకు చెందిన హాస్టల్‌ వార్డెన్‌ నోట్‌ బుక్స్‌ విషయంలో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీనిధిని ఇష్టం వచ్చినట్లు చితకబాదాడు. దీంతో సోమవారం విద్యార్థిని తల్లిదండ్రులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో కలిసి పాఠశాల సిబ్బందిని నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ లీలావతి పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించారు. ఘటనపై పాఠశాల సిబ్బందిని మందలించారు. ఈ విషయమై పాఠశాల ఇన్‌చార్జి అరుణ్‌కుమార్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు. జాన్‌ అకాడమీలో హాస్టల్‌ నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌ ఆరోపించారు.

వరుస దొంగతనాలతో జనం బెంబేలు


పది రోజుల వ్యవధిలో నాలుగు ఘటనలు

కొల్చారం(నర్సాపూర్‌): మండలంలో వరుస దొంగతనాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. తాజాగా మండల కేంద్రంలోని ముత్యం శ్రీనివాస్‌ కిరాణా దుకాణం తాళాలు పగులగొట్టిన దొంగలు దుకాణంలోని రూ.30 వేల నగదుతో పాటు పదివేల విలువగల కిరాణ సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ హైమద్‌ మోహినుద్దీన్‌ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. పది రోజుల క్రితం కొల్చారానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు రూ.2.50 లక్షల నగదుతోపాటు వెండి సామగ్రిని ఎత్తుకెళ్లారు. శనివారం రంగంపేటలోని శ్రీ తిరుమల రైస్‌ మిల్లులో రూ.3.53 లక్షల నగదును దోచుకెళ్లారు. అదే రోజు రాంపూర్‌లోని దుర్గామాత ఆలయంలో చోరీకి యత్నించారు. మండలంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలు పోలీసులకు సవాలుగా మారాయి. రాత్రి గస్తీ ఏర్పాటు చేయడంతో పాటు దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.

విద్యుత్‌ స్తంభం పైనుంచి పడి కార్మికుడి మృతి

ములుగు(గజ్వేల్‌): విద్యుత్‌ స్తంభం పైనుంచి కిందపడిన పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన కొమ్ము యాదగిరి(38 కొన్నేళ్లుగా గ్రామపంచాయతీలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఉదయం గ్రామంలో నిచ్చెన వేసుకుని విద్యుత్‌ స్తంభం ఎక్కి మరమ్మతులు చేశాడు. కిందికి దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీకి రెఫర్‌ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ యాదగిరి సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

న్యూజిలాండ్‌ డప్పు ప్రదర్శనకు భాస్కర్‌


అందె భాస్కర్‌

మిరుదొడ్డి(దుబ్బాక): 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా న్యూజిలాండ్‌లోని అక్లాండ్‌ టౌన్‌తో పాటు, ఇతర ప్రదేశాల్లో జరిగే డప్పు కళా ప్రదర్శనకు మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన ఉస్తాద్‌ బిస్మిల్లా ఖాన్‌ అవార్డు గ్రహీత, అందె భాస్కర్‌ ఎంపికయ్యారు. కాగా న్యూజిలాండ్‌-ఇండియా సెంట్రల్‌ అసోసియేషన్‌, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుల నుంచి ఆయనకు ఆహ్వానం లభించింది. భారతీయ, తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేయడానికి సంబురాల పేరిట న్యూజిలాండ్‌లో అందె భాస్కర్‌తోపాటు తెలంగాణలోని పలువురు కళాకారులు డప్పు కళా ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

నేరం ఇక్కడ.. మకాం అక్కడ

- కష్టంగా గంజాయి నిందితుల పట్టివేత
- అరెస్టైన 35 మందిలో 23 మంది పక్క రాష్ట్రాల వారే
- నిందితులను పట్టుకునేందుకు సహకరించని అక్కడి పోలీసులు

పటాన్‌చెరు టౌన్‌: గంజాయి రవాణా, విక్రయం, వినియోగంపై ఎక్సైజ్‌ శాఖ దృష్టి సారించి అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతోంది. పటాన్‌చెరు ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఈ ఏడాది గంజాయికి సంబంధించి 22 కేసులు నమోదు కాగా అందులో 35 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో 23 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారే. పటాన్‌చెరు శివారులోని టోల్‌గేట్‌ మీదుగా గంజాయిని తరలిస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. కాగా ఇతర రాష్ట్రాల నుంచి ఓఆర్‌ఆర్‌ మీదుగా తీసుకొస్తున్నారు. ఇందులో ఎక్కువగా పాతనేరస్తులే ఉండటం గమనార్హం.


మహారాష్ట్రలో నిందితులను పట్టుకున్న ఎక్సైజ్‌ సీఐ, సిబ్బంది

ఫోన్‌ సిగ్నల్‌ లేని ప్రాంతాలకు వెళ్లడంతో..

గంజాయిని ఎక్కువగా మహారాష్ట్ర, జార్ఖండ్‌, ఛత్తీస్‌గఢ్‌, ఒడిశా, బీహార్‌ రాష్ట్రాలకు చెందిన వారు తరలిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు పటాన్‌చెరు ఎక్సైజ్‌ స్టేషన్‌ పరిధిలో గంజాయి రవాణా కేసుల్లో పట్టుబడిన 30 మందిలో 23 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఉన్నారు.

సహకరిస్తలేరు



గంజాయి కేసులో అరెస్టు అవగానే బెయిల్‌ తీసుకుని స్వరాష్ట్రాల్లో తలదాచుకుంటున్నారు. దర్యాప్తులో భాగంగా వారిని పట్టుకోవడానికి అక్కడికి వెళితే ఆ ప్రాంత పోలీసులు తమకు సహకరించడం లేదు. చెప్పకుండా వెళ్లి దర్యాప్తు చేసి ఇటీవలే ఐదుగురిని పట్టుకొచ్చాం. – పరమేశ్వర్‌ గౌడ్‌, ఎక్సైజ్‌ సీఐ

వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా బెయిల్‌ తీసుకుని సొంత రాష్ట్రాలకు వెళ్లి తలదాచుకుంటున్నారు. నిందితుల కోసం వారి రాష్ట్రాలకు వెళ్తే దొరకడం లేదని, కనీసం అక్కడి పోలీస్‌ సిబ్బంది సహకరించకపోవడం విస్మయానికి గురిచేస్తుంది. నిందితులు ఫోన్‌ సిగ్నల్‌ లేని ప్రాంతాలకు వెళ్లడంతో సమాచారం తెలుసుకోవడం కష్టంగా మారింది. అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నేరుగా వెళ్లి వెతికితే ఇటీవలే ఐదుగురు నిందితులు పట్టుబడ్డారని పటాన్‌చెరు పోలీసులు పేర్కొన్నారు.